

# అబ్లిగేషన్

తులసి బాలకృష్ణ

ఆ రోజు వరదరాజు చాలా కోపంగా వున్నాడు.

"చచ్చేంత అర్జంటు పనుందీ, సి యల్. గ్రాంటు చేస్తే యింటికి పోతాను" అంటే, "టట్ ! వల్లకాదు - హ్యాండ్సు లేరు" అన్నాడు ఏజంటు.

రుసరుసలాడుతూ, ఛీఫ్ క్యాషియర్ దగ్గర క్యాష్ తీసుకుని, కౌంటర్ ఎక్కాడు వరదరాజు. 'రిసీవ్, పేమెంటు ఒక్కడే చావాలి. గంగాధరం గాడు కూడా యీవాళే శెలవుపెట్టి చావాలి'—చిరచిరలాడుతూనే డస్క్‌లాగి, రూపాయల కట్టలన్నీ వేటికి వాటికి వేరుగా సర్దుతున్నాడు.

"సరైన సూపర్విజన్ లేకపోతే యిలాగే ఏడుస్తుందండీ ఇదే కాదు—ప్రతి బ్యాంకూ యిలాగే ఏడుస్తోంది. డైమూలేదూ - ఏ వల్లకాడూ లేదు."

అప్పటికే అరగంటనుంచీ కౌంటర్ని పట్టుకుని, అధ్యక్షుడి రాకకోసం ఆత్రతగా ఎదురుచూస్తున్న కార్యనిర్వాహకుల్లా, నీరసించిపోయిన పార్టీల్లోంచి అంటున్నారెవరో.

వరదరాజు మింగేసేలా చూసాడు.

గొంతు వినిపించినవైపు తన వెనక కిటికీ దగ్గరున్న పాసైన చెక్కుల్నీ, వాటిని పాస్‌చేసిన — కటకటా లవతలున్న — ఆఫీసర్ని భయంకరంగా చూసాడు

రిసీవింగ్, పేమెంటు మొదలయ్యింది. అందరిమీదా తెగ అరిచేస్తున్నాడు వరదరాజు

"చూడండీ — ఇచ్చిన నోట్లు తీసుకోండి. అందరికీ కొత్తవి అంటే ఎక్కడొస్తాయి ?"

"వీనికే వొచ్చిందండీ ? ఆఁ — దీనికేఁ వొచ్చింది ? ఒక మూల నలిగితే చెల్లదా ? మేమేమైఁనా నోట్లు అచ్చేస్తున్నామా ?"

"ఆ రెండు నోట్లూ వేరేవి యివ్వండి ఏఁవాఁ ?? ఆ నగిలిన నోట్లు నేను పుచ్చుకోను. పోయి ఏజంటుగారికి రిపోర్టు చేసుకోండి కావలిస్తే. 'రిస్కు' మాదండీ — ఆయనిది కాదు."

"చిల్లరా ? చిల్లరివ్వడానికి యిదేమైఁనా చిల్లర దుకాణమనుకున్నారా ? — ఏజంటు గారివ్వమన్నారా ? — కౌంటరు 'బిజీ'గా వుందట - ఇవ్వట్ట అని చెప్పండి."

"ఏవిటండీ యీ నోటునిండా యీ సంతకాలూ ? ఆఁ ? నే తీసుకోను - అది అంతేనండి."

- ఈ విధంగా వరదరాజు ఎవర్నీ 'ఒబ్లయిజ్' చెయ్యలేదు. కౌంటర్ దగ్గర జనం ఖాళీ అవటానికి రెండుగంటలు పట్టింది.

'హమ్మయ్య' అనుకుని, షర్టులోకి 'వుఫ్'మని వూదుకుంటూ వెనక్కి జార్లపడుతూ, ఏజంటు రూమువైపు చూసాడు వరదరాజు.

ఈ రోజు తనచేత 'రిసీవ్' రిజెక్ట్ చెయ్యబడ్డవాళ్ళు పదిమందిదాకా వున్నా రక్కడ ఏజంటు మాత్రం ఏఁవంనగల్డు ? లీవు 'గ్రాంటు' చెయ్యనందుకు ఈ విషయంలో తేలుకుట్టిన దొంగలా వూరుకుంటాడు. కొంచెం కోపం తగ్గి, గర్వంగా ఫీలయ్యాడు వరదరాజు.

"హాయ్ రాజూ ! హౌ డూ యు డూ ?" — స్వీట్ వాయిస్.

చటుక్కున తలతిప్పాడు రాజు. పోల్చుకోవటానికి ఒక్క క్షణంకంటే ఎక్కువ పట్టలేదు. 'ఫ్లాష్ బ్యాక్' లోకి పరిగెట్టబోయిన మెదడు — మధ్యలోనే భార్య రాధ గుర్తురావటంతో ఆగిపోయింది.

"హాయ్ లల్లీ ! హౌ డూ యు డూ ?" — ఆనందం, ఆశ్చర్యం కలబోసి అంటూ, కౌంటర్‌లోకి చాపిన ఆమె చేతిలోని వందరూపాయల నోటుని అందుకుంటూ, ఆమెకేసి ప్రశ్నార్థకంగా చూసాడు.

"చిల్లరియ్యి. ఊఁ — ఏవిటి చెప్పు. పెళ్ళయిందా ?" ఆతృతగా అడిగింది.

ఆమెమీద ఎప్పుడో చల్లారిపోయిన

కోపం గబుక్కున పుబికిరాపోతే, 'ఛప్ నోర్ముయ్' అని లోలోనే నొక్కేసి, చిరునవ్వు అరువు తెచ్చుకున్నాడు

"ఈ మధ్యే. ఎలా వుంది నీ సంసారం ?"

"నా సంసారమే చెప్పాలి — పచ్చడి సంసారం" వెటకారంగా అంది.

"ఏం ? ఏఁవొచ్చింది ? మీ ఆయన..." వరదరాజులో ఏదో చెప్పలేని ఆతృత.

'ఆయనా ? ! 'వాడు' — నాకు ఆయనేవిటి నా బొంద ! ఆ రోజు అహంకారంతో నిన్ను కాదని వెళ్ళినందుకు నిజంగా నాకు మాంచి ప్రాయశ్చిత్తవేఁ జరిగింది. బుద్ధితక్కువై డబ్బుకు అమ్ముడుపోయాను. నిజంగా చూస్తే నీలో ఎన్నోవంతు అందముంది వాడికి ? ! గుణంలో - నీ ముందు వాడు బలాదూరు "

ముఖస్తుతిని భరించడానికి వరదరాజు యిబ్బంది ఫీలయినవాడై చిరునవ్వుతో నోటు బల్లమీద వుంచి, డెస్క్‌లోంచి చిల్లర కాగితాలు తీయడంలో నిమగ్నుడయ్యాడు.

"వాడికి లేని చెడు గుణం లేదు. నా గొంతు కోసాడు" ఆమె గొంతు కొంచెం వణికిన మాట నిజం

"నీ జీవితం యిలా అయినందుకు నిజంగా నేను చాలా బాధపడుతున్నాను లల్లీ ! ఊ—పిల్లలా ? !" అన్నాడు చిల్లర నోట్లు అందిస్తూ, లల్లీ భర్త కంటె ఆమె పాత ప్రియుడైన తను ఎన్నో విధాల గొప్పవాడని ఆమె నోటే వినేసరికి అతను చాలా గర్వంగా ఫీలవుతున్నాడు కానీ అది పైకి ఏమాత్రం కనిపించకుండా 'తను మంచివాడ్ని, నిగర్విని' అని యింకోసారి నిరూపించుకోదలిచాడు వరదరాజు. తన్ను కాదని వెళ్ళినందుకు ఆమెకి మంచి శాస్తి జరిగింది.

"పిల్లలు లేరు యింకా. అదొకటి అదృష్టమనుకో" అంది నోట్లు బ్యాగ్‌లో పెట్టుకుంటూ.

"మకాం ఎక్కడా ?"

"మాకో మకాఁ, ఓ వూరూ అని వుందా ? ఏ రోజు ఏ వూరో ఆ భగవంతుడికూడా తెలియదు. నా వెనక కొంచెం దూరంగా నల్ల కళ్ళద్దాల వాడొకడున్నాడు చూడు. గళ్ళచొక్కా, నల్ల ప్యాంటు- మరీ అంత 'డైరెక్టు'గా చూసెయ్యకు అసలే అనుమానపు మనిషి. వాడే నా మొగుడు. ఈ పదికి ఒకట్లియ్యి చెప్పుతాను. 'ఇంత సేపయ్యిందే ?' అని వాడడిగినాగానీ, సమాధానం చెప్పడానికుంటుంది'' అంది.

ఒకట్లు తీసుకుంటూ వరదరాజు వ్రేళ్ళని తాకింది లల్లీ

"వస్తా రాజూ ! బహుశా యిదే




"ఆఖరి కలయికేమో మనది. బై. కిసెన్" అంటూ వెళ్ళిపోయింది

లల్లీ ...! ఒకప్పుడు పబ్లిక్ గార్డెన్స్, టాంక్‌బండ్, గండిపేట... ఒకటేమిటి తన జంటనగరాలు మొత్తం జంటగా తిరిగిన లల్లీ — తన్ని పెళ్ళాడి సుఖపడవలసిన లల్లీ — అహంకారంతో తన్ని కాదని, ఒక దుర్మార్గుడి భార్య అయి, అష్టకష్టాలు పడుతూ, యిప్పుడు 'రిపెంటు' అవుతోంది.

మనిషి మునుపటికంటె బాగా చిక్కింది ముఖంలోనూ, మాటల్లోనూ మాత్రం పూర్వపు ఆకర్షణ పోలేదు.

వేరొకడి భార్య అయికూడా లల్లీ తనని ప్రేమిస్తోంది

తను నిజంగా 'హి-మేన్'

ఆనందంతో పుల్కితబ్బిబ్బవుతూ, అర్ధనిమీలిత నేత్రుడై వరదరాజు ఆమె యిచ్చిన వందరూపాయల నోటుని "కిసెన్" అంటూ పెదవులకు అద్దుకున్నాడు

పెదవులకు ఏదో గరగ్గా తగిలింది.

చటుక్కున వులిక్కిపడి, నోటు వైపు చూసిన వరదరాజు తలపై పిడుగుపడ్డట్టయింది నోటుమీద ఏటవాలుగా ప్లాస్టిక్ కాగితం అంటించి వుంది. లైటువైపుకి నోటుని ఎత్తిపట్టుకుని చూస్తూ, నోటుకి ఎదురు మూలల్లో వున్న నెంబర్లు 'టాలీ' కాకపోవడంతో నోటు వదిలేస్తూ, 'యూ — చీట్' అంటూ ముందు బల్లమీదకి వాలిపోయాడు వరదరాజు